## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 1 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో జోనల్ గేమ్స్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్యారం, చెస్, టెన్నిస్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, డీడీ రమాదేవి, ఏసీఎంవో పుర్క ఉద్దవ్, క్రీడా అధికారి మీనా రెడ్డి, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



## గెలుపోటములు సహజం

**బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు**



జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న కమాండెంట్

హాజీపూర్, అక్టోబర్ 1 : క్రీడల్లో గెలుపోటములు సహజమని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు అన్నారు. గుడిపేట బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న పోలీసులకు నిర్వహిస్తున్న క్రీడలు మంగళవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కమాండెంట్ క్రీడాకారులను పరిచయం చేసుకొని జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. 100మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హై జంప్, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, బెటాలియన్ అధికారులతో పాటు ట్రైనీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సారు.. ఏమిటిది?

- నీతులు చెప్పేందుకే కానీ.. మీ పార్టీ కార్యకర్తలకు వర్తించవా..!
- లక్షెట్టిపేటలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ 11 మంది
- ఇందులో నలుగురు హస్తం లీడర్లే

మంచిర్యాల, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి): నీతులు చెప్పేందుకే తప్పు.. పాటించడానికి కాని చేయవు అన్నట్లు ఉంది మంచిర్యాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు. ఓ వైపు మంచిర్యాలలో గంజాయి, డ్రగ్స్, జూదం ఉండరాదని ఎమ్మెల్యే పీఎస్సార్ చెబుతుంటే.. మరోవైపు ఆ పార్టీ లీడర్లే పేకాట ఆడుతూ పట్టుబడడం గమనార్హం. లక్షెట్టిపేటలోని ఓ పేకాట స్థావరంపై సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఇందులో 11 మంది పట్టుబడగా, ఇందులో కాంగ్రెస్ కీలక నాయకులు దండేపల్లి మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, లక్షెట్టిపేట మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ ఎండీ షాహిద్ ఉన్నారు. కానీ అధికార పార్టీ నుంచి వీరి పేర్లు బయటికి రావొద్దంటూ పోలీసులకు ఆదేశాలు ఉన్నట్లు సమాచారం. అందుకే సోమవారం రాత్రే దాడి జరిగినప్పటికీ మీడియాకు సమాచారం ఇవ్వలేదు. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' స్థానిక ఎస్ఐ, సీఐలకు ఫోన్ చేయగా ఎవరినీ పట్టుకోలేదని చెప్పారు. అప్పటికే విషయం బయటికి రావడంతో.. మంగళవారమైన పోలీసులు వివరాలు వెల్లడిస్తారని అంతా భావించారు. రాజకీయ ఒత్తిడో.. లేక మరేంటో తెలియదు కానీ ఎవరికీ వివరాలు ఇవ్వలేదు. చివరకు ఈ విషయంపై సీపీని సంప్రదించగా ఆయన కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎట్టకేలకు పేర్లు బయట పెట్టారు. ఇంటి పేర్లు ఇవ్వకుండా ఇన్షియల్‌తో పేర్లు పెట్టిన వారిలో లక్షెట్టిపేట ఎస్ఐ సతీశ్ తాను బయట ఉన్నానని ఎఫ్ఐఆర్‌లో ఉన్న పేర్లు మీకు పంపిస్తానని చెప్పారు. కాగా 'నమస్తే తెలంగాణ'కు వచ్చిన సమాచారంలో ఉన్న పేర్లను ఆయనకు వాట్సాప్‌లో పెట్టగా.. అవును అన్నట్లుగా థంబ్ సింబల్ పెట్టిన ఆయన కాసేపటికే దాన్ని డిలీట్ చేశారు. అరెస్టు అయిన వారిలో కాంగ్రెస్ లీడర్లు ఉన్న కారణంగానే ఈ వివరాలు బయటికి చెప్పలేదని తెలిసింది. కాసేపటికే టాస్క్‌ఫోర్స్ నుంచి పూర్తి వివరాలు 'నమస్తే తెలంగాణ'కు అందాయి. ఈ ఇద్దరితో పాటు కాంగ్రెస్ లీడర్లు లింగాల తిరుపతి, బాజాల రమేశ్ కూడా దొరికిన వారిలో ఉన్నారు. కొండపల్లి శ్రీకాంత్, కల్వల వెంకటేశ్, కొంగల రాజ నరేందర్‌రెడ్డి, సముద్రాల వేణుగోపాల్, పడాల గౌతమ్, మెంగని సత్తయ్య, పోతరాజుల శ్రీనివాస్ మిగిలిన వారిలో ఉన్నారు. వీరి నుంచి రూ.30,970, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలకు చెందిన వారిగా పోలీసులు చెబుతున్నారు.

### కొన్ని రోజుల క్రితమే పిలిచి వార్నింగ్..

కాంగ్రెస్ పార్టీలో ఎవరూ ఎలాంటి ఇల్లీగల్ పనులు చేయొద్దు. జూదం లాంటి వాటిని అసలు ప్రోత్సహించవద్దు. అలా చేస్తే సహించేది లేదని కొన్ని రోజుల క్రితమే ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆ పార్టీ నాయకులకు వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఆ తర్వాత తాను సొంతంగా చేయాలనుకుంటున్న ప్రశాంత మంచిర్యాల కాన్సెప్ట్ మీడియా ముందు ఎమ్మెల్యే వెల్లడించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. సార్.. ఎంత చెప్పినా వినకుండా కొందరు ఇలాంటి పనులను కొనసాగిస్తున్నారని, దీంతో ఎమ్మెల్యేకు చెడ్డ పేరు వస్తుందంటూ ఆ పార్టీ లీడర్లే మండిపడుతున్నారు. ఇలాంటి పనులు చేసినందుకు సొంత ఇంటి మనుషులు అనుకున్నవారిని సైతం ఎమ్మెల్యే పక్కన పెట్టారని చెబుతున్నారు. మరి ఈ పేకాట ఆడుతూ పట్టుబడిన నాయకుల విషయంలో ఎమ్మెల్యే ఏం చేస్తారు. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారా..లేకపోతే చూసీచూడనట్లు మిన్నకుండిపోతారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.


# శనిగకుంటలో మట్టి తీసేదెప్పుడో?

**ఆక్రమించారని తెలిసీ చర్యలు తీసుకోవడంలో అధికారుల జాప్యం**

- అది రెవెన్యూ అధికారుల బాధ్యత అంటున్న ఇరిగేషన్ శాఖ
- ఇంత పెద్ద ఘటన జరిగినా ఎందుకు స్పందించడం లేదంటూ ప్రశ్నిస్తున్న స్థానికులు
- వెంటనే సర్వే చేసి బఫర్ జోన్‌లో పోసిన మట్టిని తొలగించాలని డిమాండ్
- బాపురెడ్డికి 4.31 ఎకరాలుంటే 4.20 ఎకరాలే ఉన్నట్లు లెక్కలు
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



శనిగకుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో పోసిన మట్టి కుప్పలు



ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో పోసిన మట్టిని తొలగించాలని పట్టాదారుకు ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నోటీసు కాపీ

మంచిర్యాల, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జిల్లాలోని చెరువుల ఆక్రమణలపై కొరఢా ఝుళిపిస్తున్న యంత్రాంగం 'శనిగకుంట'పై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని ఆయకట్టు రైతులు, స్థానికులు ఎప్పటి నుంచో వేడుకుంటున్నా, ఏమాత్రం స్పందించకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

### మట్టి పోయడం వల్లే..

చెన్నూర్‌లోని శనిగకుంట మత్తడి పేల్చివేత ఘటన తర్వాత పోలీసులు నిర్వహించిన ఏకైక ప్రెస్‌మీట్‌లో కీలకాంశాలు వెల్లడించిన విషయం విదితమే. శనిగకుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని 15.20 ఎకరాల్లో మట్టి పోయడం వల్లే వరద చెరువులోకి వెళ్లలేక ఇళ్లలోకి చేరిందని, ఆ కారణంగానే మత్తడి పేల్చివేశారని స్వయంగా పోలీసులే ప్రకటించారు. ఆపై ఆ 15.20 ఎకరాలు ఎవరి పేరు మీద ఉన్నాయి. ఎవరెవరు కొనుగోలు చేశారు. అనే వివరాలను పేర్లతో సహా వెల్లడించారు. ఆ తర్వాత కొందరు అధికార పార్టీ లీడర్లు కీలక సూత్రధారులన్న విషయం తేటతెల్లమైంది. అరెస్టైన నలుగురిని విచారించిన సమయంలోనూ వారి పేర్లు బయటికి రావడంతో పోలీసులు అరెస్టు చేసి.. నాటకీయ పరిణామాల మధ్య వారిని విడిచి పెట్టారు. కొందరు పరారీలో ఉన్నారని చెప్పారు. ఆ పరారీలో ఉన్న ఇద్దరిని గత నెల 27న అరెస్టు చేసినట్లు సమాచారముంది.

### అధికారులు పట్టించుకోలే..

జిల్లాలోని చెరువుల విషయంలో అక్రమ నిర్మాణాలపై కొరఢా ఝుళిపిస్తున్న అధికారులు మరి శనిగకుంట చెరువు విషయంలో ఎందుకు వెనుకడగు వేస్తున్నారంటూ స్థానికులు, ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. కుమ్మరికుంట మాదిరిగానే శనిగకుంట చెరువును సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. శనిగకుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో గత కొన్ని సంవత్సరాల నుంచి పట్టాదారులు మట్టి పోస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నిస్తున్నారు. మట్టి పోసిన వారిపై చర్యలు తీసుకోకుండా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2022 జూన్‌లో కొందరు పట్టాదారులు శనిగకుంటలో మట్టి పోసి చెరువు సామర్థ్యాన్ని దెబ్బ తీస్తున్నారని ఆయకట్టు రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పుడు చెరువును పరిశీలించిన అధికారులు సర్వే నంబర్ 355, 356,357,358, 359లలో మట్టి పోసి చెరువు ప్రవాహన్ని అడ్డుకున్నారని, పోసిన మట్టిని తొలగించాలని, చెరువును యధాస్థితికి తేవాలని, లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ పట్టాదారులైన మంచాల రాజబాపునకు నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసును తదుపరి చర్యల కోసమని తహసీల్దార్‌కు పంపించారు. ఇదయ్యాక కూడా పట్టాదారు పైన చెప్పిన సర్వే నంబర్లలో రాత్రికి రాత్రి మట్టి తెచ్చి పోస్తున్నారని తెలియడంతో పోలీసులకు సైతం అధికారులకు ఫిర్యాదు చేశారు.

### లైట్‌గా తీసుకున్నరు

కాగా, ఈ వ్యవహారంలో నోటీసులు ఇవ్వడం, చర్యలకు తహసీల్దార్‌కు సిఫార్సు చేయడం తప్ప తాము ఏమీ చేయలేమని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను నిర్ణయించాలన్నా.. అందులో ఉన్న మట్టిని తొలగించాలన్నా.. అది రెవెన్యూ పరిధిలోకి వస్తుందని చెబుతున్నారు. ఇలా ఇరిగేషన్ శాఖ, రెవెన్యూశాఖల మధ్య సమన్వయలోపంతోనే శనిగకుంటను అధికారులు లైట్ తీసుకున్నారు. ఈ ఫిర్యాదుల వ్యవహారం రెండేళ్ల నుంచి నడుస్తున్నా అధికారులు సీరియస్‌గా తీసుకోలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్16న శనిగకుంట మత్తడిని డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్స్‌తో పేల్చి ధ్వంసం చేశారు. దీంతో ఆలస్యంగా నిద్రలేచిన ఇరిగేషన్ అధికారులు చెరువులో ధ్వంసమైన మత్తడిని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనిగకుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో పోసిన మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్ సెప్టెంబర్ 21న తహసీల్దార్ మల్లికార్జున్‌కు లేఖ రాశారు. దీనిపై తహసీల్దార్ మల్లికార్జున్ వివరణ కోరగా.. పట్టాదారులు తమ పట్టా భూముల్లో పోసిన మట్టి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందో లేదో సర్వే చేయాలన్నారు. సర్వేలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో మట్టి పోసినట్టు తేలితే తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, రైతులు ఫిర్యాదు చేసినప్పుడే విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ఉంటే మత్తడి పేల్చే వరకు వచ్చేది కాదని స్థానికులు, ఆయకట్టు రైతులు అంటున్నారు. అధికారుల అలసత్వంతోనే ఇంత వరకు వచ్చిందని మండిపడుతున్నారు.

### బాపురెడ్డి భూమిపై తప్పుడు లెక్కలు

పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు శనిగకుంట బఫర్ జోన్‌లోని భూమిని గోదావరిఖనికి చెందిన వ్యక్తి నుంచి చెన్నూర్‌లోని కొందరు కొనుగోలు చేశారు. అదే భూమిని కాంగ్రెస్ లీడర్ గొడిసెల బాపురెడ్డికి విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలోనే 15.20 ఎకరాల్లో 4.20 ఎకరాలు బాపురెడ్డి పేరుమీద రిజిస్ట్రేషన్ సైతం చేశారని చెప్పారు. వాస్తవానికి బాపురెడ్డి పేరుపై కాకుండా ఆయన కొడుకు గొడిసెల ప్రవీణ్‌కుమార్ పేరుమీద సర్వే నంబర్లు 360/1/3లో ఎకరం ఐదు గుంటలు, 360/1అ/3లో 11 గుంటలు, 360/2/3లో ఎకరం ఐదు గుంటలు, 360/6లో ఎకరం ఐదు గుంటలు, 360/ఆ/3లో ఎకరం ఐదు గుంటలు దాదాపు 4 ఎకరాల 31 గుంటలు ఉన్నట్లు ధరణిలోనే చూపిస్తున్నది. మరి పోలీసులు 4.20 ఎకరాలే బాపురెడ్డి పేరు మీదకు రిజిస్ట్రేషన్ అయినట్లు తప్పుడు లెక్కలు చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. పైగా సర్వే నంబర్ 360 అనేది శనిగకుంటను ఆనుకొని ఉన్న తొలి సర్వే నంబర్. చెరువుకు ఓ పక్కన ఉన్న ఈ సర్వే నంబర్ తర్వాతే పోలీసులు వెల్లడించిన వివరాల్లోని మిగిలిన సర్వే నంబర్లు వస్తున్నాయి. అవే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉంటే.. ఈ సర్వే నంబర్ కూడా కచ్చితంగా ఉండాలి. కానీ ఆ భూములు ఎలా రిజిస్ట్రేషన్ అయ్యాయి అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. పైగా మొన్నటికి మొన్న బాపురెడ్డి సహా మరో ఇద్దరిని అరెస్టు చేసి తీసుకెళ్లిన పోలీసులు కాసేపటికే వదిలేశారు. ఈ నేపథ్యంలో ఈ లీడర్‌కు ఎందుకు ఇంత ప్రాధాన్యం ఇస్తున్నారనేది అర్థం కాకుండా పోయింది. అటు ముందే చర్యలు తీసుకోవడంలో విఫలమైన ఇరిగేషన్‌శాఖ అధికారులతో పాటు భూములను రిజిస్ట్రేషన్ చేసిన రెవెన్యూ శాఖ, తప్పుడు లెక్కలు చెప్పిన పోలీసు శాఖపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా ఈ కేసులో నిజానిజాలు వెల్లడించి, శనిగకుంట మత్తడి పేల్చివేతకు కారకులైన వారిని అదుపులోకి తీసుకోకపోతే స్థానిక జనాల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చే అవకాశాలు ఉన్నాయి. అది అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు పోలీసు శాఖకు చెంపపెట్టుగా మారొచ్చనే చర్చ స్థానికంగా నడుస్తున్నది.

# పూల పండుగ వచ్చేసింది

- నేడు ఎంగిలి పూల బతుకమ్మ
- తొమ్మిది రోజుల పాటు ఆడిపాడనున్న ఆడబిడ్డలు



మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 1 : పూల పండుగ రానే వచ్చింది. తెలంగాణ మహిళలు ప్రత్యేకంగా జరుపుకునే పండుగల్లో ప్రాధానమైనది బతుకమ్మ. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తెలంగాణ అస్థిత్వం బతుకమ్మ పండుగలో ఇమిడి ఉంటుంది. దసరాకు ముందుగా వచ్చే ఈ పండుగను గౌరీ పండుగ, సద్దుల పండుగ, పూల పండుగ అని కూడా పిలుస్తారు. మహాలయ అమావాస్య అయిన బుధవారం మొదలయ్యే బతుకమ్మ (ఎంగిలి పూలు) సంబురాలు సద్దులతో ముగుస్తాయి.

### ఒక్కో పూవ్వుకు ఒక్కో ప్రత్యేకత..

పూలు బాగా వికసించే కాలంలో జలవనరులు సమృద్ధిగా పొంగిపొర్లే వేళ బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. బతుకమ్మకు అలంకరించే పూలకు పలు ప్రత్యేకతలున్నాయి. పసుపు పచ్చ రంగులో తంగేడు పువ్వు శుభాలకు సూచికగా నిలుస్తున్నది. ఎర్రగా ఉండే గోరింట, ఎర్రకట్ల పూలు ప్రేమానురాగాలకు చిహ్నం. తెలుపు రంగులో ఉండే గునుగు పూలు శాంతిని చాటిచెప్తాయి. ఆకుపచ్చగా ఉండే గుమ్మడి, దోస ఆకులు సస్యశ్యామలానికి నిదర్శనం. వీటికి తోడుగా బంతిపూలు, చామంతి, తామర, టేకు, తెల్లకట్ట, వాము, గడ్డిపూలను బతుకమ్మ అలంకారానికి వాడుతారు. సంబురాలు జరుపుకునే తొమ్మిది రోజుల్లో మహిళలు బొడ్డెమ్మ (మట్టితో చేసిన దుర్గాదేవి ప్రతిమ)ను బతుకమ్మతో పాటు చేసి ఒకచోట చేర్చుతారు. చీకటి పడేదాకా బతుకమ్మ పాటలు పాడుతూ.. ఆడుతూ బొడ్డెమ్మలు తీస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మ పేరుతో జలశయాల్లో నిమజ్జనం చేస్తారు.

### మార్కెట్‌లో సందడి

మంచిర్యాల మార్కెట్‌లో మంగళవారం పండుగ సందడి కనిపించింది. మహిళలు తీరొక్కపూలను కొనుగోలు చేశారు.

# తగ్గిన యాసంగి సాగు

- గతేడాది 43 వేల ఎకరాల్లో పంటలు
- ఈసారి 30 వేల ఎకరాల్లోపే..
- గత సీజన్‌కంటే 30 శాతం తక్కువ
- అప్పడే మండుతున్న ఎండలు.. ఆపై విద్యుత్ కోతలు
- కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కరువు
- ఆసక్తి చూపని రైతాంగం



కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేయకపోవడంతో కాలువల్లో పెరిగిన గడ్డి

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో కొన్నేళ్లుగా పెరుగుతూ వచ్చిన యాసంగి సాగు, ఈయేడాది తగ్గుముఖం పట్టింది. గత యాసంగి సీజన్‌లో దాదాపు 43 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ఈ యేడాది 40 వేల ఎకరాల్లో సాగు ఉంటుందని అధికారులు భావించినప్పటికీ, 30 వేల ఎకరాల్లోపే పంటలు వేస్తున్నట్లు తెలుస్తున్నది. కేసీఆర్ సర్కారులో 24 గంటల ఉచిత విద్యుత్, సాగు నీటి వనరులతో దర్జాగా పంటలు తీసిన రైతాంగం, ఈసారి మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వ్యవసాయానికి అనధికారిక విద్యుత్ కోతలు మొదలు కాగా, కరంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందోనన్న భయం రైతులను వెంటాడుతుంది. దీనికి తోడు జిల్లాలో ప్రధాన సాగునీటి జలాశయమైన కుమ్రం భీం ప్రాజెక్టులో 10 టీఎంసీల నీటి నిల్వకు బదులుగా 5 టీఎంసీలనే ఉంచడం, కాలువల ద్వారా ఇంకా నీటిని విడుదల చేయకపోవడంతో యాసంగి సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు.

### 30 శాతం తగ్గుముఖం

గత యాసంగిలో రైతులు సాగుచేసిన పంటలతో పోలిస్తే ఈ యాసంగిలో సాగు గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. గత యాసంగిలో శనగ 7,881 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 4,600 ఎకరాల్లో సాగు అవుతోంది. అలాగే పెసర గతేడాది 2,148 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది 425 ఎకరాల్లో మాత్రమే సాగు అవుతోంది. జొన్న, మొక్క జొన్న పంటలు కూడా గతేడాదితో పోలిస్తే ఈసారి సగానికి పైగా తగ్గినట్లు తెలుస్తోంది. గతేడాది సాగైన పంటలతో పోలిస్తే ఈఏడాది 30 శాతం వరకు సాగు తగ్గింది. ఇక బోర్లు ఉన్న రైతులు ఫిబ్రవరి చివరి వరకు కూడా జొన్న, మక్క టమాట, బెండ, బీర వంటివి సాగు వేస్తుంటారు. మూడు నెలల్లోనే ఈ పంటలు చేతికి వస్తాయి. అయితే.. ఈ ఏడాది ఎండలు కూడా ముందే పెరగడం, విద్యుత్ కోతలు మొదలవ్వడంతో ఆ పంటల సాగులోనూ వెనుకడుగు వేసినట్లు తెలుస్తోంది. గతంలో కుమ్రం భీం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేసేవారు. కాలువల్లో పైపులు వేసి ఆయిల్ ఇంజన్ల ద్వారా పంటలకు నీరు మళ్లించుకునేవారు. ఈసారి పంట కాలువల ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో ఆయిల్ ఇంజన్ల ద్వారా కూడా రైతులు నీరు పెట్టుకోలేని పరిస్థితి నెలకొంది.



ఎస్పీ శ్రీనివాస రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఐలు

## ఎస్పీని కలిసిన ఎస్ఐలు

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 1 : ఇటీవల ట్రైనింగ్ పూర్తి చేసుకొని విధుల్లో చేరిన ప్రొహిబిషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లు అనిల్, సర్తాజ్ పాషా మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి గుర్తింపు తెచ్చుకోవాలని వారికి సూచించారు.

## 'పల్లె వెలుగు'లో మంటలు

పెంచికల్‌పేట్, అక్టోబర్ 1 : పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. మంగళవారం కాగజ్‌నగర్ నుంచి బెజ్జూర్‌కు వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు చెడువాయిలోని పల్లె ప్రకృతి వనం దగ్గరకు చేరుకోగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ వెంటనే బస్సు నిలిపివేయగా, ప్రయాణికులు భయంతో బస్సు దిగి పరుగులు తీశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బస్సును అక్కడే నిలిపివేయడంతో కొందరు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లిపోయారు. మరికొందరిని వేరే బస్సులో పంపించారు. ఈ విషయమై డీఎంను వివరణ కోరగా, ఇంజిన్ వేడెక్కడంతో ప్రమాదం జరిగి ఉంటుందని తెలిపారు.

## మద్యంపై నిషేధాజ్ఞలు పొడిగింపు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 1 : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై అమలులోఉన్న నిషేధాజ్ఞలను నవంబర్ ఒకటి వరకు పొడిగిస్తున్నట్లు రామగుండం కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి దాడులకు, ఆగడాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. డీజే, డ్రోన్‌లపై ఉన్న ఆంక్షలు కూడా నవంబర్ 1 వరకు కొనసాగుతాయని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 1 : యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు గొప్పవని ప్రశంశించారు. రక్తదాతలను అభినందించారు. అనంతరం నిర్వాహకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌తో డా.అనిత, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్, కార్యదర్శి చుంచు మహేందర్, లయన్స్ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

## ఆర్‌ఎస్పీ గురించి మాట్లాడితే ఊరుకోం

**బీఆర్‌ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావ్**

కాగజ్‌నగర్, అక్టోబర్ 1 : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసే అర్హత లేదని, మరోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావ్ స్పష్టం చేశారు. ఇటీవలే కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఓ కౌన్సిలర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అవినీతి అక్రమాలపై స్పందించడం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయమై మంగళవారం కన్వీనర్ స్పందించారు. కాగజ్‌నగర్ పట్టణంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకే సిర్పూర్ నియోజకవర్గానికి వచ్చారని, కోర్టులో ఉన్న భూమిపై మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. కౌన్సిలర్ స్థాయిని బట్టి మాట్లాడాలని, హోదాను మించి మాట్లాడితే ఊరుకోబోమని చెప్పారు. ఈయన వెంట బీఆర్‌ఎస్ నాయకుడు నక్క మనోహర్, తదితరులున్నారు.

# వయోవృద్ధుల సంక్షేమం అందరి బాధ్యత

**కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే**

నస్పూర్, అక్టోబరు 1 : వయోవృద్ధుల సంక్షేమం, పోషణ అందరి బాధ్యత అని కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం మంచిర్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవానికి హాజరయ్యారు. అనంతరం వయోవృద్ధులను శాలువాలతో సన్మానించారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయాచోట్ల జిల్లా సంక్షేమాధికారులు స్వరూపరాణి, భాస్కర్, డీఆర్‌డీవో కిషన్, ఏసీపీ ప్రకాశ్, డీఎంహెచ్‌వో అనిత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బానోత్ దత్తారాం, వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాచర్ల బుచ్చమ్మ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా సమన్వయకర్త సౌజన్య, డీసీపీవో ఆనంద్, సీడీపీవోలు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



వయోవృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## మంచిర్యాల మార్కెట్‌లో పాము కలకలం



మార్కెట్‌లో కనిపించిన పాము

మంచిర్యాల మార్కెట్‌లో మంగళవారం సాయంత్రం ఓ పాము కలకలం రేపింది. బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ పండుగ నేపథ్యంలో రైతులు ఆయా ప్రాంతాల నుంచి పూలను మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఆ మూటల నుంచి ఓ పాము ఒక్కసారిగా బయటకు వచ్చి ప్రజల కాళ్ల మధ్యన తిరగడంతో భయంతో పరుగులు తీశారు. చివరకు పక్కన ఉన్న కాలువలోకి అది వెళ్లిపోవడంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. *- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్*